# ఆదివాసుల గిరిజన కళారూపాలు

**మానుపాడు సత్యనారాయణ-చరవాణి: 7032031983**

Email: satyanarayanamanapadu@gmail.com

**జానపద కళల శాఖ**

**పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటి**

## చెంచునాటకాలు:

ఆ కాలంలో చెంచు నాటకాలను గొల్లవారే ప్రదర్శిస్తూ ఉండేవారు. వీరి నాటకాలు ఆనాటి పల్లెటూళ్లలో చాలా పేరుపొందాయి. ప్రతి గ్రామంలోనూ వీరు నాటకాలను ప్రదర్శిస్తూ ఉండేవారు. ఆ వీధిలో వీరు నాటకం ఆడించారని వీరూ, వీరు ఆడించారని వారూ, ఇలా ప్రతి వీధిలోనూ ప్రదర్శించటంతో, ఎక్కువ రోజులు ఒకే గ్రామంలో ఉండి, తగిన పారితోషికాలను సంపాదించుకుని మరో గ్రామానికి తరలి వెళుతూ ఉండేవారు.

చెంచు నాటకాలలో ముఖ్యమైన ఇతివృత్తం అహోబల నరసింహస్వామి చెంచీతను- అంటే చెంచువారి కన్యను మోహించి వివాహం ఆడటం.

ఈ అహోబలక్షేత్రం కర్నూలు జిల్లాలో చెంచువారు నివసించే అడవి మధ్య ఒక కొండ ఉంది. ఆ కొండ మీద నరసింహస్వామి దేవాలయం ఉంది. స్వామి ఉత్సవ సమయంలో చెంచు పడుచులు విల్లంబులు చేతపట్టుకొని చురుకుగా యాత్రికుల మధ్య స్వేచ్ఛగా చకచకా తిరుగుతూ స్వైర విహారం చేస్తుంటారు. ఆ చెంచిత కథనే 'గరుడాచల మహత్యం' అని పూర్వకవి యక్షగానంగా వ్రాసాడు. దాని ననుసరించి అనేక మంది ఆ యక్షగానాన్ని ప్రదర్శించారు.

## దేవతల కొలుపుల సంబరాలు:

ఈనాడు దేవతల కొలుపులు అన్ని గ్రామాల్లోను అంతగా జరగకపోయినా అక్కడక్కడ వెనుకబడిన ప్రాంతాల్లో దేవతల మొక్కుబడులు, జాతరలు, సంబరాలు జరుగుతూ ఉంటాయి. వీటిని ఉగాది, సంక్రాంతి మొదలైన పండుగ దినాల్లో జరుపుతారు. గ్రామ దేవతలకు నైవేద్యాలు అర్పిస్తారు. గరగలు, ఘటాలు నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా ఇంటింటికి త్రిప్పుతారు. డప్పుల మీద సప్త తాళ వాయిద్యాన్ని మాదిగలు వాయిస్తూ

ఉంటే గరగలను ఎత్తుకొన్ని చాకళ్ళు (రజకులు) లయబద్ధమైన చిందులతో, తన్మయత్వంతో నృత్యం చేస్తారు. ఆ సందర్భంలో వాయించే డప్పు వాయిద్యం ఈ విధంగా సాగుతుంది.

**తాళం వరుసలు:**

త ఝణక, ఝణక, ఝణకా

తద్దివిత – ధివిత, తకతా

కిటతక – కిటతక – కిటతక

తాం – ధోం – తక్కిట కిటతక

ఝంతరి కిటతక – ధుంతరి కిటతక – ధుంతరి కిటతక

అని డప్పుల మీద పలికిస్తూ, మధుర భావాలు ఒలికిస్తూ, భక్తి తన్మయత్వంతో ప్రజలను ముగ్ధులను చేస్తూ వారి హృదయాలను రాగరంజితం చేస్తూ ఉంటారని ఒక సందర్భంలో కీ॥శే॥ నేదనూరి గంగాధరంగారన్నారు.

**గిరిజన కళారూపాలు:**

ఆంధ్రదేశంలో అటు రాయలసీమ నుండి ఇటు ఇచ్ఛాపురం వరకూ అన్ని ప్రదేశాల్లోనూ కలిపి మొత్తం 38 గిరిజన జాతులున్నాయని, వీరి జనాభా 13 లక్షలని, డి.ఆర్.ప్రతాప్ గారి వ్యాసానికి ఆధారంగా 'నాట్యకళ' జానపదుల కళల ప్రత్యేక సంచికలో ఉదహరించారు.

ఆదిలాబాద్ జిల్లాలో గోండులు, కొలాములు, మధురాలు, ప్రధానులు, ఆంధ్రులు ముఖ్య జాతులు. నాయిక పోడులు ప్రధానంగా కరీంనగర్ జిల్లాలో కనిపిస్తారు. వరంగల్, ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాల ఏజెన్సీ ప్రాంతాల్లో కోయలు, కొండరెడ్లు ఎక్కువ.

విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల కొండ ప్రాంతాలలో బగతలు, కొండదొరలు, వాల్మీకులు, మూలదొరలు, సామంతులు, గదబలు, కమ్మరలు, కోటియాలు ఎక్కువ కనిపిస్తారు. శ్రీకాకుళం జిల్లాలో జాతపు దొరలు, సవరలూ మాత్రమే కొండ ప్రాంతాల్లో ఉన్నారు. కర్నూలు జిల్లాలోని నల్లమల అడవులలోనూ, మహబూబ్‌నగర్ జిల్లాలోని అమరాబాద్ పీఠభూమి ప్రాంతంలో చెంచులు నివసిస్తున్నారు. రాష్ట్రంలో అనేకచోట్ల కనిపించే జాతి బంజారులు. వీరినే సుగాలీలనీ, లంబాడీలనీ, లబానీలు అని కూడా పిలుస్తారు. ఇక ఎరుకలు, ఏనాదులు మైదాన ప్రదేశాలలోని నివాసాలు ఏర్పరుచుకున్న వారున్నారు.

గిరిజనులకు సంవత్సరం పొడుగునా వ్యవసాయమే జీవనాధారం. గోండులు, కోయలు, బగతలు, వాల్మీకులు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని భూములను సేద్యం చేసుకుంటారు. కొండరెడ్లు, కొండ దొరలు, సామంతులూ, సవరలూ నిలకడగా ఒక చోట కాక, తమకు తోచిన ప్రదేశాలలో పోయి వ్యవసాయ చేసుకుంటారు.

ఇక కోయలు, బగతలు, వాల్మీకులు, కొలాములు, నాయకపోడులు, కోటియాలు, మూఖదొరలు మొదలైన గిరిజన జాతులు కూడా పోడు వ్యవసాయం ద్వారా అదనపు ఆదాయాల కోసం ప్రయత్నిస్తారని డి.ఆర్.ప్రతాప్ గారు వ్రాసారు. అలా గిరిజనులు జీవిత విధానాలను సాగించుకుంటూ ఆనందం కోసం సంగీతాన్ని, నృత్యాన్ని, వాయిద్యాన్నీ జోడించి ఎన్నో కళారూపాలను సృష్టించుకున్నారు.

## గోండుల గుసాడి నృత్యం:

ఆదిలాబాద్ జిల్లా రాజగోండులకు దీపావళి పెద్ద పండుగ. చలికాలం ప్రారంభ మయ్యేసరికి పంటలన్నీ చేతికి వచ్చి ఉంటాయి. తాము చెమటోడ్చి చేసిన కష్టం ధాన్యలక్ష్మిగా నట్టింట చేరుతుంది. గోండులందరూ ఆటపాటలతో కాలక్షేపం చేసే రోజులు ప్రారంభ మవుతాయి. రకరకాల వస్త్రాభరణాలు వేసుకొని యువజనులు సంగీత వాయిద్యాలతో అతిథులుగా పొరుగు గ్రామాలకు తరలి వెడతారు. కొమ్ము లూదుతూ, తప్పెట్లు వాయిస్తూ యాత్రలు సాగిస్తారు. గోండుల పురాణ గాథలలోని "దండారియా రౌడ్, సిసిసెర్మా రౌడ్" అనే కథానాయకులను అనుసరిస్తూ ప్రతి సంవత్సరం నృత్యాలు చేస్తారు.

గోండు యువకులు దీపావళి నెలలో సాంప్రదాయకమైన ఈ నృత్యం జరుగుతుంది. పౌర్ణమినాడు కార్యక్రమం ప్రారంభమవుతుంది. చతుర్దశి వరకు జరుగుతుంది. గుసాడి నర్తకునికి కావలసిన సామగ్రిలో ముఖ్యమైనవి నెమలిపించంతో తయారు చేసిన తలపాగా. ఇందులో గొర్రెపోతు కొమ్ములను కూడా అమర్చుతారు. కృత్రిమ గడ్డాలు,మీసాలతో వేషం కడతారు. మేకతోలు కప్పుకుంటారు. ఇక వాయిద్యాలు–డప్పు, తుడుము, పిప్రే, బాకా, కలికొయ్ (తప్పెట) మొదలైనవి వాద్య బృందానికి హుషారునిస్తాయి. సంగీత వాయిద్యాలను, గుసాడి నృత్య పరికరాలను గోండులు పరమ పవిత్రంగా భావిస్తారు. నాట్యారంభానికి ముందు వాటికి పూజలు చేస్తారు.